## ప్రజావాణి ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం: అదనపు కలెక్టర్

**రంగారెడ్డిఅర్బన్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డిఆర్ఓ సంగీతతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖలవారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 51ఫిర్యాదులు వచ్చాయని, వాటిని సంబంధిత అధికారులు పరిష్కరించేవిధంగా తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూశాఖ16, ఇతరశాఖలకు21, మొత్తం51 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులుపాల్గొన్నారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## కెసిఆర్ 100 హామీలు ఇవిగో...

**-కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఎం.డి.ఇబ్రహీం**

**షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన కెసిఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి నిలువునా మోసంచేశారని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత ఎం.డి.ఇబ్రహీం తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం బిఆర్ఎస్ రజతోత్సవసభలో కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం ఆయన కెసిఆర్ ప్రజలకు ఇచ్చిన 100 అబద్ధాల హామీలు ఇవిగో అంటూ ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కెసిఆర్ తాను ఇచ్చిన అబద్ధాల హామీలు ప్రజలకు అన్నీ తెలుసునని రజతోత్సవ సభలో కెసిఆర్ హరిశ్చంద్రుడిలా మాట్లాడి ప్రజలపై కపటప్రేమ వలకబోస్తున్నారని ఆయన ఎద్దేవాచేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకొని అప్పులకుప్పగా మార్చిన కెసిఆర్ గత 15నెలలుగా ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని, రేవంత్‌రెడ్డి పాలనపై ఏమాత్రం అవగాహన లేకనే ప్రసంగాలు చేశారని ఆయన ఎద్దేవాచేశారు.

## కెసిఆర్‌పై మహిళా కాంగ్రెస్ ధ్వజం

**-షాద్‌నగర్‌లో కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం**



కెసిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న మహిళా నేతలు

**షాద్‌నగర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణరాష్ట్రంలో మహిళలను కించపరిచే విధంగా మాట్లాడారని, వెంటనే క్షమాపణ చెప్పకపోతే తగిన గుణపాఠం చెబుతామని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జె.నాగమణి డిమాండ్ చేశారు. షాద్‌నగర్ కాంగ్రెస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పట్టణ చౌరస్తాలో కెసిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా మహిళలకు కల్పించిన బస్సు సౌకర్యంపై కెసిఆర్ రాజకీయంగా మాట్లాడుతూ బస్సుల్లో మహిళలు జుట్టుపట్టుకొని కొట్టుకుంటున్నారని మహిళలను అగౌరవపరిచే విధంగా మాట్లాడడం సబబు కాదని పేర్కొన్నారు. మహిళలను ఏ ఉద్దేశంతో అలా మాట్లాడారని కెసిఆర్‌ను మీడియా ముఖంగా నిలదీశారు. కెసిఆర్ కూతురిలా మహిళలు లిక్కర్ స్కామ్‌చేయలేదని, కోట్లరూపాయలు కూడబెట్టలేదని, తాముకూడా కోట్లరూపాయలు సంపాదించి ఉంటే ఆర్టీసీ బస్సుల్లో తిరగకుండా పేదమహిళలందరూ కార్లు కొనుక్కునే వారమని ఎద్దేవా చేశారు. నేడు ఆర్టీసీ బస్సుల్లో నిరుపేద మహిళలు ఆధార్ కార్డు సహాయంతో రాష్ట్రం మొత్తం తమ పనులపై తిరుగుతున్నారని, ఎంతోమంది శ్రామిక మహిళలు పొట్టకూటి కోసం నిరంతరం పట్టణాలకు, పల్లెలకు తిరుగుతూ జీవనోపాధి పొందుతున్నారని, మహిళలకు ఆర్థికభారం తగ్గించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదమహిళల పాలిటి దేవుడని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో తిరుగుతున్న మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కెసిఆర్ పేద మహిళలకు ఆర్టీసీ సంస్థకు, ప్రభుత్వానికి క్షమాపణ చెప్పాలని, లేకపోతే గ్రామాల్లో వచ్చే ఎన్నికల్లో తిరగనివ్వకుండా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ ఆందోళనలో కొందుర్గు మహిళా అధ్యక్షురాలు వజ్రమ్మ, కేశంపేట మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, నందిగామ మండల అధ్యక్షురాలు బాలరణి, పట్టణ అధ్యక్షురాలు చంద్రకళ, మాజీ కౌన్సిలర్ మెహముదా బేగం, మహిళా నాయకురాలు స్రవంతి, శంకరమ్మ, పర్వీన్, ఫాతి, శోభ తదితరులు పాల్గొన్నారు.

## యువరైతు వినూత్న నిరసన

**రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**



నిరసన తెలుపుతున్న యువకుడు జీవన్

తన భూమిని పట్టా భూమిగా మార్చాలని ఓ యువకుడు వినూత్న నిరసన తెలిపిన సంఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని మంగళపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. తనభూమిని పట్టాభూమిగా మార్చాలని ఎన్ని దరఖాస్తులు పెట్టుకున్నా అధికారులు స్పందించడం లేదని చెట్టుకు తలకిందులుగా వేలాడుతూ నిరసన వ్యక్తంచేశాడు. రంగారెడ్డిజిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన వుల్లింతల జీవన్‌కు తండ్రినుంచి కొంతభూమి వారసత్వంగా వచ్చింది. ఆ భూమిని 20ఏళ్ల కిందట తనతండ్రి ఓ వ్యక్తి నుంచి కొనుగోలుచేసి సాగు చేసుకుంటున్నారు. ఈ భూమికి కొత్త పాస్ బుక్, పాత పాస్ బుక్, టైటిల్ డీడ్, పహానీ పత్రాలు అన్నీ ఉన్నా.. గతంలో అధికారులు చేసిన తప్పుల వల్ల సీలింగ్ హోల్డర్‌లో ఉన్న సర్వేనంబర్‌లో పడింది. ప్రస్తుతం ఈభూమిని అధికారులు నిషేధిత జాబితాలో చేర్చారు. ఇదిలా ఉండగా అసలు సీలింగ్ హోల్డర్ రెండు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించాడు. దీనిపై పూర్తి ఆధారాలతో రెవెన్యూ శాఖకు, కలెక్టర్‌కు, తహసీల్దార్, ఆర్డీవో ఆఫీసులకే గాక ముఖ్యమంత్రి కార్యాలయానికి కూడా వందకుపైగా లేఖలు రాసినా ఎలాంటి పురోగతి లేదని బాధితుడు తెలిపాడు. ఇలా సంవత్సరం పాటు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విన్నపాలు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయాడు. దయచేసి ఈ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి, మా భూమి మాకు తిరిగి ఇప్పించాలని లేఖలో కోరాడు. ఇక దీనిపై తనకు న్యాయం చేయాలని కోరుతూ.. తన భూమిలోనే ఉన్న వేపచెట్టుకు భూమిపత్రాలను కట్టడంతోపాటు అదేచెట్టుకు తానుకూడా తలకిందులుగా వేలాడుతూ నిరసన వ్యక్తం చేస్తున్నాడు. దీనికి సంబంధించిన వీడియోను తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. దీంతో ఈ వీడియో కాస్తా నెట్టింట వైరల్‌గా మారింది. ఈ విషయాన్ని తెలుపుతూ కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సిసిఎల్ఏకు ట్యాగ్ చేసినట్లు తెలిపారు.

## కలెక్టరేట్ వద్ద గ్రామపంచాయతీ వర్కర్ల ధర్నా

**-ఐదు నెలల నుంచి అందని వేతనాలతో అవస్థలు**



కలెక్టరేట్ ముందు ధర్నాచేసిన గ్రామపంచాయతీ వర్కర్లు, సిఐటియు నాయకుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద గ్రామపంచాయతీల కార్మికులు ధర్నా చేసి ఆందోళన వ్యక్తం చేశారు. గత ఐదు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వివిధ గ్రామపంచాయతీల కార్మికులు ధర్నా చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ గేట్ ముందు గ్రామపంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున విచ్చేసి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఉపాధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో గ్రామ పంచాయతీల కార్మికులకు గత ఐదునెలల నుంచి వేతనాలు చెల్లించకపోవటంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామపంచాయతీ వర్కర్ల పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆతరువాత జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈధర్నాలో జిల్లా సిఐటియు కోశాధికారి ఉన్నికృష్ణన్, గ్రామపంచాయతీ వర్కర్లు నాయకులు, సుధాకర్, ఆరోగ్యం, ప్రశాంత్, శ్రీనివాస్, కృష్ణ, రాములమ్మలతోపాటు గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## నేడు కొడంగల్ బార్ లైసెన్సు డ్రా..

**వికారాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

జిల్లాలోని కొడంగల్ మున్సిపాలిటీలోని 1 నెంబర్ బార్ లైసెన్సు డ్రా తీయబడనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలో 1 నెంబరు బార్ లైసెన్స్ జారీ చేసేందుకు ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యములో కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో డ్రా తీయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు లేదా వారి నుండి పవర్ ఆఫ్ అటార్నీ పొందిన వ్యక్తులు తప్పనిసరిగ్గా 10 గంటలకు ఎంట్రీ పాస్‌తో సమావేశ హాలునందు హాజరు కావాల్సిందిగా సూచించారు.

# భూసమస్యల పరిష్కారానికే భూభారతి

**తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్**



రైతుల అవగాహనసదస్సులో మాట్లాడుతున్న తెలంగాణరాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్

**కోట్‌పల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త;**

తెలంగాణరాష్ట్రంలో భూసమస్యలు పరిష్కరానికే భూభారతిచట్టం రైతులకు చుట్టంలాంటిదని తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. సోమవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో బుగ్గాపూర్ డియంఆర్ ఫంక్షన్‌హాల్‌లో భూభారతి చట్టంపై రైతులకు, గ్రామప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ. జూన్2నుంచి ప్రతిగ్రామంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి అక్కడే సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు, భూభారతి కీలక అంశాలు ధరణి స్థానంలో కొత్త భూమిహక్కుల రికార్డు భూభారతి తీసుకురావడం జరిగిందన్నారు. రికార్డులలో తప్పులు సవరణచేసి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గతంలోని సాదా బైనామా పెండింగ్ దరఖాస్తులు పరిష్కరిస్తామన్నారు. భూమి హక్కులు ఏవిధంగా సంక్రమించినా, మ్యుటేషన్ చేసి రికార్డుల్లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. భూభారతిలో పాసు పుస్తకాలలో భూమి పట్టా ఇవ్వడం జరుగుతుందన్నారు. భూససమ్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీలు వ్యవస్థ భూదార్‌కార్డులు జారీచేయడం జరుగుతుందన్నారు. ఇంటి స్థలాలకు కూడా భూమిహక్కులు రికార్డుచేసి పట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్రప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ఎవరైనా ప్రభుత్వ, భూదాన్ అసైన్డు, ఎండోమెంట్, వక్ఫ్‌భూములకు పట్టాలుపొందితే రద్దు చేసే అధికారం ఈచట్టంలో ఉందన్నారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు భూమి హక్కులు ఉండి రికార్డులో లేని వారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్తచట్టం వచ్చిన సంవత్స రంలోగా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. కోనుగోలు,దానం,తనఖా,బదిలీ, భాగ పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులో మార్పులుచేసి పట్టాదారు పాసుపుస్తకం జారీ చేస్తారు. అనంతరం, వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ. రికార్డులో తప్పుల సవరణకు రెవెన్యూ డివిజన్ అధికారి ఈదరఖాస్తులు పరి శీలించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ విచారణచేసి హక్కులరికార్డులో మ్యుటేషన్ చేస్తారన్నారు. నిర్ణీత వ్యవధిలో తహసీల్దార్ మ్యుటేషన్ చేయకపోతే డీమ్డ్ మ్యుటేషన్‌గా పరగణిస్తుందన్నారు. అదేవిధంగా పాత పాసుపుస్తకం ఉంటే అందులో నమోదు చేయడం లేదా కొత్త పాసు పుస్తకం జారీచేయడం జరుగుతుందన్నారు. సాదా బైనామాలు క్రమబద్ధీకరణ 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణప్రాంతంలోని వ్యవసాయభూమిని సాదాబైనామా ద్వారా కొనుగోలుచేసి 12, సంవత్సరాలు వినియోగంలో ఉంటే 12.10.2020 నుండి 10.11.2020ల మధ్యకాలంలో క్రమబద్ధీకరణ కోసం సన్న,చిన్నకారు రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్‌డిఓలు విచారణ చేసి అర్హత ఉన్నవారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ వసూలుచేసి సర్టిఫికేట్ జారీచేసి హక్కులు కల్పించి రికార్డులో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇవ్వడం జరుగుతుందని వారు పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి, వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్‌డిఓ వాసుచంద్ర, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ డానియెల్, మండల విద్యాధికారి చంద్రప్ప, ఆర్ఐ భాగ్యలక్ష్మి, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి వాహిద్‌మియా, తెలంగాణరాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నర్సింహరెడ్డి, వికారాబాద్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు అయూబ్ అన్సారీ, పెద్దెముల్ మాజీ జట్పిటిసి ధారాసింగ్, కోట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింగ్‌నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్కల బందయ్య, మోత్కుపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఎన్నారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌ముదిరాజ్,వెంకట్‌రాంరెడ్డి,కోట్‌పల్లి మాజీ సర్పంచ్ నక్కల విజయలక్ష్మి పాల్గొన్నారు.

## భూభారతి చట్టం ద్వారా భూసమస్యలకు పరిష్కారం

**-జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ నారాయణరెడ్డి

**కందుకూరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

భూమి హక్కుల పరిరక్షణకై సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని ఈ చట్టంపైన ప్రజలలో అవగాహ కల్పించడానికి మండలాలవారిగా రైతులకు అంగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని రంగారెడ్డి జిల్లా కలక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం మండలకేంద్రంలోని టంకరిరాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలోజరిగిన అవగాహనసదస్సులో పాల్గొని అయన మాట్లాడారు. 2020లో గతప్రభుత్వం తీసుకువచ్చిన ధరణిచట్టం ద్వారా భూసమస్యలు పెరిగిపోయాయన్నారు. నేటిప్రభుత్వం ధరణిద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించాలంటే ఏమిచేయాలనే ఆలోచనతో దేశంలోని 18రాష్ట్రాలకు సంబంధించిన రెవెన్యూచట్టాలు ఎలా ఉన్నాయని ప్రజలకు ఏవి మేలు జరిగేలా ఉన్నాయని కమిటీల ద్వారా పరిశీలనజరిపించి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఈచట్టంద్వారా పరిపాలనా వికేంద్రీకరణ చేస్తూ భూమి యజమానులకు సులువైన మార్గంలో సమస్య పరిష్కారం అయ్యేలా అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ముందు తహసీల్దార్ వద్ద దరఖాస్తు చేసుకుంటే వాటిపైన విచారణచేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అక్కడ ప్రజలకు న్యాయం జరుగకుంటే ఆర్డీఓ వద్ద, ఇలా న్యాయం కోసం పైఅధికారులకు విన్నవించుకునే అవకాశం ఈ చట్టం ద్వారా వెసలుబాటు కలిగిందన్నారు. చట్టవిరుద్ధంగా నిబంధనలకు వ్యతిరేకంగా భూబదలాయింపులు జరిగినా, అన్యాక్రాంతమైన భూముల విషయంలో సుమోటొగా పరిశీలనచేసి పొరపాటు జరిగినట్లు గుర్తిస్తే వాటిని రద్దుచేసే అధికారం తహసీల్దార్లకు ఉంటుందన్నారు. భూమి సమస్యలు ఉంటే రైతులు, భూమియజమానులు ఎవరైనా తమ సమస్యలను ఈజూన్ మొదటి వారంనుండి గ్రామాలవారీగా రెవెన్యూ అధికారులు నిర్వహించే రెవెన్యూ సదస్సులలో నేరుగా అర్జీ చేసుకుంటే సమస్యకు పరిష్కారమార్గం దొరుకుతుందన్నారు. అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. దానివలన భూసమస్యలు న్యాయస్థానాల వరకు వెళ్లకుండా చాలాకాలం పాటు పెండింగ్ లేకుండా రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు. ధరణి పోర్టల్‌లో తప్పులు జరిగితే దానికి సంబంధించి సమస్య పరిష్కారంకోసం బాధితులు యేడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని కలక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా భూభారతి చట్టంపైన అంశాలవారీగా వివరించారు. కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపిఓ గీతారెడ్డి, ఎంఎఓ లావణ్య, మార్కెట్‌కమిటీ ఛైర్మన్ క్రిష్నానాయక్, టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహ్మారెడ్డి, మాజీ జెట్పిటిసిలు, పెద్దరామయ్య, ఎ.జంగారెడ్డి, బి.జంగారెడ్డి, ఆయాగ్రామాల రైతులు అయాశాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా క్రూడ్ ఆయిల్ దందా

**రసాయనిక వ్యర్థాలను భూమిలోకి పారబోత**



వ్యర్థాలను భూగర్భ జలంలోకి వదులుతున్న దృశ్యం

**నందిగామ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

అసలే పరిశ్రమలు వదిలే వాయు కాలుష్యంతో ఉక్కిరి బిక్కిరి అవుతుంటే మరో ప్రాణాంతక జలకాలుష్యం కోరలు చాచి చుట్టుపక్కల ప్రాంతాల వారిని ఇబ్బందులపాలు చేస్తుంది. వివరాల్లోకి వెళితే..నందిగామ మండలకేంద్రం శివారులోని నూజివీడు సీడ్ పరిశ్రమ పక్కన ఉన్న ఓ పేరులేని పరిశ్రమలో సబ్బుల తయారీలో ఉపయోగించే నూనె తయారు చేస్తున్నారు. ఎక్కడినుండో తెచ్చిన రామెటీరియల్ బట్టీలలో ఉడికించి నూనెతీసే క్రమంలో దుర్గంధపూరితమైన దుర్వాసన వెదజల్లడంతో ఈప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు, రైతులు, కార్మికులు అనుక్షణం భయంతో వణికి పోతున్నారు. బట్టీల ద్వారా వేడి చేసి వాటి నుండి పనికివచ్చే నూనెను తీసి వ్యర్థపుజలాలను యథేచ్ఛగా భూగర్భ జలంలోకి వదులుతూ వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా కొనసాగిస్తున్నారు. కాలుష్య నియంత్రణ పరికరాలు ఉపయోగించకుండా యథేచ్ఛగా భూగర్భజలంలోకి వదలడంతో తాగు, సాగునీటికి ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. నందిగామ శివారులో పాత జాతీయ రహదారిపై నడుపుతున్న ఈ పరిశ్రమను సోమవారం ఉదయం నందిగామ పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి సందర్శించినట్లు తెలిపారు. ఈపరిశ్రమ నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లేకుండా పరిశ్రమ నడపడంపై యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

## నంబర్‌ప్లేట్ లేని వాహనదారులకు కౌన్సిలింగ్

**-10 బైక్‌లకు నంబర్‌ప్లేట్ల బిగింపు**



బైక్‌లకు నంబర్‌ప్లేట్లు బిగించిన దృశ్యం

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

నంబర్‌ప్లేట్ లేని వాహనాలను నడిపితే తగిన చర్యలు తీసుకుంటామని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పందిరి పరుశురాం పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్ రోడ్డులో సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీలు చేపట్టారు. రాచకొండ పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల చెకింగ్ చేశారు. ఈ సందర్భంగా నంబర్‌ప్లేట్ లేని 10ద్విచక్రవాహనాలను ఆపి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బైక్‌లను నడుపుతున్న వాహనదారులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. కొత్త నంబర్‌ప్లేట్లు తయారు చేయించి పట్టుబడ్డ వాహనాలకు బిగించి పంపించారు. వాహనాల ముందు, వెనక భాగంలో తప్పనిసరిగా నంబర్‌ప్లేట్లు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ పందిరి పరుశురాం సూచించారు.

## 410 కిలోల గంజాయి పట్టివేత

**మేడ్చల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

సినీఫక్కీలో పనసపండ్ల లోడులో గంజాయి అక్రమరవాణా చేస్తున్న ముఠాను పట్టుకున్న సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారని టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ పోలీసులు గత 20రోజులుగా గంజాయి తరలింపుపై నిఘా ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఆదివారంరాత్రి మేడ్చల్ సమీపంలోని రింగురోడ్డు వద్ద టాస్క్‌ఫోర్స్, మేడ్చల్ ఎక్సైజ్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా మహారాష్ట్ర నంబర్ ప్లేటుతో వెళుతున్న మినీ వ్యాన్‌ను ఆపి తనిఖీలు చేశారు. అందులో పనుసపండ్ల లోడు ఉండగా అనుమానం వచ్చి మరింత తనిఖీ చేసి పనసపండ్ల కింద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వాహనంలో ఉన్న 410 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని గంజాయి తరలిస్తున్న గణేష్ మునుస్వామి(27), విజయ్‌శంకర్ కులకర్ణి(53)లను అదుపులోకి తీసుకుని విచారించారు. ఒడిసానుంచి గంజాయి వ్యాపారం చేస్తున్న వ్యక్తుల వద్ద నుండి గంజాయిని కొనుగోలు చేసి ఎవరికీ అనుమానం రాకుండా ఉండాలని గంజాయిపైన పనసపండ్లను నింపి తరలిస్తున్నామని నిందితులు ఒప్పుకున్నారు. సుమారు కోటి రూపాయలు విలువ చేసే 410 కిలోల గంజాయితోపాటు నిందితుల వద్ద మూడు సెల్ ఫోన్‌లు, గంజాయి తరలిస్తున్న వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు మేడ్చల్ ఎక్సైజ్ సిఐ నవనీత తెలిపారు.

## మహిళ హత్య కేసులో నిందితుని అరెస్ట్




పోలీసుల అదుపులో నిందితుడు బాబయ్య

**ధారూరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని రాజాపూర్ గ్రామంలో దోమ మండలం రాకొండ గ్రామానికి చెందిన వెంకటమ్మ (45) ఈ నెల 25న దారుణ హత్యకు గురైన సంఘటన పాఠకులకు తెలిసిందే. అప్పటి నుంచి నిందితుడు బాబయ్య పరారీలో ఉన్నాడు. సోమవారం పరిగి బస్టాండ్‌లోని నిందితుడు బాబయ్య ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన ను విచారించగా వెంకటమ్మ గత రెండునెలల నుంచి తనతో సహజీవనం చేస్తుందని, గత వారంరోజుల నుండి అతనితో గొడవపడుతూ తరచు వెళ్ళిపోతానని చెప్పేదని, అందుకే గొంతు నులిమి చంపేశానని నేరం అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఎలాంటి ఆధారాలు దొరకకుండా ఉండాలని తన ఇంటి పక్క గల పాడుబడ్డ ఇంట్లో తీసుకెళ్లి శవాన్ని పాతబట్టలు చుట్టి పెట్రోల్ పోసి నిప్పు అంటించాడు. ఈ మేరకు సోమవారం సిఐ రఘురాం బాబాయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచామని తెలిపారు.

## భూమిపత్రం ఇస్తామని డబ్బులు తీసుకొని పరార్

**-ఇద్దరు నిందితుల రిమాండ్**



నిందితులు బాలుసింగ్, రఫీక్‌నాయక్

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

భూమి విడుదల పత్రం ఇస్తామని ఓ వ్యక్తి నుంచి రూ.2 లక్షలు తీసుకొని పరారైన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పందిరి పరుశురాం తెలిపారు. మేడ్చల్ జిల్లా కీసర దమ్మాయిగూడ న్యూభవానినగర్‌కు చెందిన సివిల్ కాంట్రాక్టర్ కొమ్మ రాజుల రాజుసాయిలు జనవరి 9న తనకు సంబంధించిన భూమి విడుదల పత్రం కోసం ప్రయత్నిస్తున్నాడు. బాలుసింగ్, రఫీక్‌నాయక్ అనే వ్యక్తులు రాజుసాయిలుకు ఫోన్ చేసి మీభూమి విడుదలపత్రం ఇప్పిస్తామని రూ.2 లక్షలు ఇవ్వాలని అడిగారు. దీంతో రాజుసాయిలు అంగీకరించి డబ్బులు తీసుకొని ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డుకు రాగా ఇద్దరు వచ్చి హోండాషైన్ (టిఎస్24-8486) బైక్‌పై వెంట బెట్టుకొని ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రికి చేరుకున్నారు. రాజుసాయిలు వారికి సొమ్మును అందజేయగా భూమి విడుదల పత్రం తీసుకువస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో ఇద్దరికీ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అయ్యాయి. బాధితునికి రోడ్డు ప్రమాదం కావడంతో ఘటన జరిగిన మూడునెలల తర్వాత ఈనెల 8న ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరిపారు. ఈవ్యవహారంలో నిందితులు బాలుసింగ్, రఫీక్‌నాయక్‌లను రిమాండ్‌కు తరలించినట్లు సిఐ పరుశురాం తెలిపారు.

## సొంత కంపెనీ ఎంప్లాయిస్‌కే టోపీ పెట్టిన నందా ఫుడ్స్




న్ఫోర్స్మెంట్ ఆఫీసర్ సయ్యద్ జీశాన్ అహ్మద్‌ని కలిసిన నందా ఫుడ్స్ కంపెనీ బాధితులు

**కొంపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 127 డివిజన్ నంద ఫుడ్స్ అనే పేరు మోసిన కంపెనీ రంగారెడ్డి నగర్‌లో గత 20 సంవత్సరాలుగా తన దగ్గర పనిచేస్తున్న ఎంప్లాయిస్‌కి ఈపీఎఫ్ కడుతున్నామని చెప్పి వారి జీతాలను కట్ చేసి ఇప్పుడు ఈపీఎఫ్ అప్లై చేసుకుంటే ఎవరికి ఈపీఎఫ్ అమౌంట్ రావట్లేదు. ఏంటా అని ఆరా తీస్తే ఎన్నో అవకతవకలు జరగాయని ఎంప్లాయిస్ పేరు తప్పుగా రాయడం ఎంప్లాయిస్‌కి ఎలాంటి పిఎఫ్ స్లిప్స్ ఇవ్వకపోవడం ఎన్నో సంవత్సరాలుగా కంపెనీ చుట్టూ తిరుగుతున్న బాధితులు. సోమవారం నందా ఫుడ్స్ కంపెనీలో నిర్వహించిన ఉమ్మడి జన సమన్వయ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ సయ్యద్ జీశాన్ అహ్మద్‌ని నందా ఫుడ్స్ కంపెనీ బాధితులు కలిసి తమకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. ఈ విషయమై విలేకరులు అడగగా బాధితులకు అండగా ఉంటానని వారి పీఎఫ్ అమౌంట్ అతి త్వరలో వారికి వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఓబీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తైలం శ్రీనివాస్, ఐఎన్టియూసీ నాయకులు నాగరాజ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లయ్య కాక, బాల కృష్ణ, గురువా రెడ్డి, శ్యామ్, ఇఎస్ఐ పిఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి : బోయిని




ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి కోరుతూ ర్యాలీ చేపట్టిన ఓటిఏ ప్రతినిధులు

**అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపి ప్రాణాలను బలి కొన్న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఉస్మాన్‌షాహి ట్రేడర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున్న ర్యాలీ నిర్వహించారు. పాక్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉస్మాన్‌షాహి నుంచి బయలు దేరిన ర్యాలీ గౌలిగూడ, సిబిఎస్, అశోకబజార్ తదితర ప్రాంతాలల్లో ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఉస్మాన్‌షాహి ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బోయిని వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను జీర్ణించుకోలేని పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమాయక పర్యాటకులపై కాల్పులు జరిపి ప్రాణాలు తీయడం పిరికిపంద చర్య అన్నారు. ప్రాణాలుకొల్పియిన కుటుంబాలకు తమ ప్రగాడ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో ఒటిఏ ప్రతినిధులు రాహుల్‌గుప్త, పి. రామ్‌చందర్, రాజేంద్రప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, సతీష్‌కుమార్, బి. రాముయాదవ్, విష్ణు, సంపత్, అమిత్‌గుప్త, ఎల్.ఎం జోషి, జితేందర్ కుమార్, పి. బాస్కర్, మారుతి, విశాల్, సుశాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన కుటుంబాలకు కార్పొరేటర్ సంతాపం

**బేగంబజార్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

జమ్ముకాశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పులో మరణించిన పర్యాటకులకుఆత్మకు శాంతికలుగాలని కోరుతూ జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ ఆధ్వర్యంలో కోవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. సిబిఎస్, రామమందిరం, పత్తర్‌మజీద్ తదితర ప్రాంతాలల్లో స్థానిక ప్రజలతో కలిసి కోవ్వొత్తులువెలిగించి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల కాల్పులో మరణించిన కుటుంబాలకు తమ ప్రగాడ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## పూల్‌బాగ్‌లో కొత్త నల్లా కనెక్షన్ ద్వారా మంచినీరు సరఫరా

**గన్‌ఫౌండ్రి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకుగాను అనునిత్యం కృషి చేయడం జరుగుతుందని గన్‌ఫౌండ్రి డివిజన్ బిజెపి కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్ బిస్వా అన్నారు. డివిజన్ పరిధిలోనిపూల్‌బాగ్ బస్తీలో స్థానికుల వినతి మేరకు మంచినీటి నల్లా కనెక్షన్ ఏర్పాటు చేయించి నల్లా నీరు పట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త నల్లా కనెక్షన్ ఏర్పాటు చేయించి మంచినీటి ఇబ్బందులనుకలుగకుండా మంచినీటి నల్లా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీంతో మంచినీటి సమస్యను తీరినట్లు చెప్పారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి మందలించాడని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

**కేశంపేట ఏప్రిల్ 28 ప్రభాతవార్త :**

ఇంటర్ మొదటి సంవత్సరంలో ఫెయిల్ కావడంతో తండ్రి మందలించాడని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేశంపేట మండలం వేములనర్వ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం మేరకు కేశంపేట మండలం మండల పరిధిలోని వేములనర్వ గ్రామానికి చెందిన ఆలుగొండ యాదగిరి (గిరి), లక్ష్మమ్మ దంపతులకు ఆలుగొండ నందు, శివ ఇద్దరు కుమారులు. ఆలుగొండ శివ షాద్ నగర్ పట్టణంలోని మణికంఠ వొకేషనల్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఈటి) ఎలక్ట్రిషియన్ టెక్నాలజీ కోర్సు చదువుతున్నాడు. కాగా ఇటీవల విడుదలైన ఇంటర్ వొకేషనల్ ఫలితాల్లో శివ నాలుగు సబ్జెక్ట్ లో ఫెయిల్ కావడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆలుగొండ శివ (18) ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## ఉగ్రవాదుల దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

**కేశంపేట ఏప్రిల్ 28 ప్రభాతవార్త**

కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డి పల్లి గ్రామంలో సోమవారం పహల్గాం ఉగ్రదాడిలో మరణించినటువంటి భారతీయుల ఆత్మ శాంతి కోసం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించిన గ్రామస్తులు. ఉగ్రవాదం నశించాలని నినాదంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్లె బ్రదర్స్ పల్లె బాలేశ్వర్ డాక్టర్ లింగం , పామ్ శేఖర్ రెడ్డి , సూరం శ్రీనివాస్, కుమ్మరి సత్యనారాయణ, సూరం శేఖర్, పాము తిరుపతి రెడ్డి, బుర్రి మల్లేష్ గౌడ్ కుమ్మరి కరుణాకర్, మావిళ్ళ రమేష్, పల్లె వెంకయ్య, డీజే మల్లేష్, పోచమోని రాజు, కర్నెకోట శ్రీకాంత్, దశరథ్, మహమ్మద్ గార్లు యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కెసిఆరే తెలంగాణకు మొదటి విలన్: డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

తక్కువ కాలంలో ఎక్కువ అవినీతి చేసింది కెసిఆర్ ఫ్యామిలీ అని, కెసిఆరే తెలంగాణకు మొదటి విలన్ అని రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి.వి. రవిశేఖర్‌రెడ్డి అన్నారు. వరంగల్ బిఆర్ఎస్ సభలో సోనియాగాంధీని విమర్శించే స్థాయి కెసిఆర్‌కు లేదన్నారు. పిసిసి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం వెంగళరావునగర్ కాలనీలో సోనియాగాంధీ చిత్రపటానికి రవిశేఖర్‌రెడ్డి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ తెచ్చింది, ఇచ్చింది సోనియాగాంధీ అన్నారు. సోనియాగాంధీ లేకపోతే వంద మంది కెసిఆర్‌లు వచ్చిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యేది కాదన్నారు.

## కాంట్రాక్టు అధ్యాపకులతో ప్రభుత్వం చర్చలు జరపాలి : విసి ప్రొ. ఘంటా చక్రపాణి



కాంటాక్టు అధ్యాపకులకు సంఘీభావం తెలుపుతున్న విసి ప్రొ. ఘంటా చక్రపాణి

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న అంబేద్కర్ వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు ధర్నా చేస్తున్న అంబేద్కర్ విగ్రహ ప్రాంతానికి విసి ప్రొ. ఘంటా చక్రపాణి వచ్చారు. ధర్నాలో ఉన్న కాంట్రాక్టు అధ్యాపకులకు తన సంఘీభావాన్ని ప్రకటించారు. వారి న్యాయమైన డిమాండ్లను, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానని వీసీ హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించి వారితో చర్చలు జరపాలని సూచించారు. వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని ప్రభుతవానికి సూచించారు. డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘము అధ్యక్షుడు డా. కె. అవినాష్, ప్రధాన కార్యదర్శి డా.ఎం. కిషోర్, సలహాదారులు డా. కె యాదగిరి, డా. కాసం విజయ్, ఉపాధ్యక్షురాలు కె. ఉమాదేవి, సంయుక్త కార్యదర్శి డా. పి. రాధాకృష్ణ, కోశాధికారి డా. వై. కుమార్, కాంట్రాక్టు అధ్యాపకులు డి. కోటేశ్వర రావు, డా. పడాల లక్ష్మణ్ డా. సునీల్ కుమార్, డా. విజయ ఉషశ్రీ, డి శ్రీవేణి, డా. అరుణ సిద్ధాంతి, డా. కురుమేటి దయాకర్, నర్సయ్య భట్టు పాల్గొన్నారు.

## వాహనదారులను అత్యవసర పరిస్థితులో సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడాలి

### -ఉత్తర మండలం ట్రాఫిక్ అదనపు డిప్యూటీ కమిషనర్ వేణుగోపాలరెడ్డి



ట్రాఫిక్ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమంలో సిబ్బందితో ఉత్తర మండలం ట్రాఫిక్ అదనపు డిప్యూటీ కమీషనర్ వేణుగోపాలరెడ్డి.

**బేగంపేట ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

ప్రజలు, వాహనదారులకు అత్యవసర పరిపస్థితులు ఎదురైనపుడు ట్రాఫిక్ సిబ్బంది సీపీఆర్ చేసి వారి ప్రాణాలు కాపాడాలని ఉత్తర మండలం ట్రాఫిక్ అదనపు డిప్యూటీ కమీషనర్ వేణుగోపాలరెడ్డి అన్నారు. సోమవారం ఉత్తర మండలం ట్రాఫిక్ అడిషినల్ డిసిపి వేణుగోపాల రెడ్డి పర్యవేక్షణలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జీ. శంకరరాజు ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరిధిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో ట్రాఫిక్ సిబ్బంది, మొబైల్స్ పాయింట్ డ్యూటీ కానిస్టేబుల్స్‌కు ప్రథమ చికిత్స ,సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వడదెబ్బ ,హార్ట్‌ఎటాక్, అగ్ని ప్రమాదం, రోడ్డు ప్రమాదాలు సంబవించిన సమయంలో ట్రాఫిక్ సిబ్బంది ఏ విధంగా ప్రథమ చికిత్స అందించాలి, ప్రథమ చికిత్స కిట్లో ఉన్న మందులు పరికరాలు బ్యాండేజ్, డెటాల్, టాబ్లెట్లు, కాటన్ మొదలైన వాటిని ఎలా ఉపయోగించాలనే విషయాలను విపులంగా వివరించారు. ఈ శిక్షణలో ఉత్తర మండలం లోని వివిధ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు పాపయ్య, జుట్టు భాస్కర్, రవికుమార్, ఉపాశంకర్, బి .వెంకటరాములు ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్ ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం ట్రాఫిక్ మొబైల్ డ్యూటీ ఆఫీసర్లకు ,ప్రథమ చికిత్స కిట్స్‌ను అందజేసారు.

## మే 1 నుండి రాష్ట్ర వ్యాప్తంగా" సమ్మర్ కోచింగ్ క్యాంప్"



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శివసేనారెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

జంట నగరాల్లోని అన్ని స్టేడియాలతోపాటు 33 జిల్లాలలో మే 1వ తేదీ నుండి జూన్ 6 వరకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేన రెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు 2025 పోస్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి , వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం ఆలోచనల మేరకు యువకులు క్రీడాకారులు విద్యార్థులు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా స్పోర్ట్స్ అథారిటీ ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా క్రీడా మైదానాల వైపు ఆకర్షితులయ్యే విధంగా ఈ వేసవి శిబిరాలు ఉన్న నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచితంగా యోగ, జుంబా డాన్స్‌లలో శిక్షణ ఇవ్వబోతున్నట్లు వివరించారు. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో పాల్గొనబోతున్న క్రీడాకారులు విద్యార్థులను ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, వివిధ ప్రవేటు సంస్థలు అందించే వేసవి శిక్షణ శిబిరాలు పేద మధ్యతరగతి విద్యార్థులకు క్రీడాకారులకు అందుబాటులో లేకుండా ఉన్నాయని స్పోర్ట్స్ అథారిటీ అందించబోయే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు అందరికీ అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి సోనీ బాలాదేవి డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## పహాల్గం ఉగ్రదాడి తీవ్ర విచారకరం : తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం




ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

**సికింద్రాబాద్, ఏప్రిల్ 28 ప్రభాతవార్తః** జమ్మూ కాశ్మీర్‌లోని పహాల్గంలో జరిగిన ఉగ్రదాడిని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం గాంధీ విభాగం, జుడా, టి.యన్.జి.ఓ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అభం శుభం తెలియని, విదేశీయులు, పర్యాటకులు మరణించడం దురదృష్టకరమని, భారత ప్రభుత్వం తక్షణమే దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం గాంధీ యూనిట్ అధ్యక్షులు డాక్టర్ భూపేందర్ రాథోడ్ భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్ కుమారి, ప్రిన్సిపాల్ కత్తుల ఇందిర, డాక్టర్ శేషాద్రి, డాక్టర్ సునీల్ తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులకు తగిన గుణపాఠం నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం గాంధీ యూనిట్ ప్రతినిధులు డాక్టర్ అబ్బయ్య, డాక్టర్ మురళిధర్, డాక్టర్ రవి, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ మదన్, డాక్టర్ సుబోధ్, డాక్టర్ రాజేష్ , డాక్టర్ వెంకట మణి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ రజని వివిధ శాఖల అధికారులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి శేఖర్, డాక్టర్ వసంత్, డాక్టర్ కృష్ణ నాయక్, డాక్టర్ మురళీ కృష్ణ, డాక్టర్ సుధీర్, డాక్టర్ సందీప్ కుమార్ , డాక్టర్ బ్రహ్మేశ్వర, డాక్టర్ అనిల్, డాక్టర్ నాజిం, డాక్టర్ మీనాక్షి, డాక్టర్ సరిత, డాక్టర్ నవీన్, జూడ ప్రతినిధులు డాక్టర్ అజయ్, ఇతర నాయకులు, నర్సింగ్ ఆఫీసర్ ల సంఘం వైద్యులు నాయకులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థి విభాగం మరియు వైద్య విద్యార్థులు , వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లాలాగూడ కేంద్రీయ రైల్వే హాస్పిటల్‌కు రోటరీ క్లబ్ వీల్ చైర్లు అందజేత



కార్యక్రమాన్ని ప్రారంబిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

**తార్నాక, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**

రోటరీ క్లబ్ జూబ్లీ హిల్స్, షార్ ప్రాజెక్టల సి.ఎస్.ఆర్ చొరవతో రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ లాలాగూడలోని కేంద్రీయ రైల్వే హాస్పిటల్‌కు 50 వీల్ చైర్‌లను విరాళంగా ఇచ్చింది. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలు ఎంతో గొప్పవన్నారు. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల రాజారాం, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీ లోకేష్ విష్ణోయ్, రైల్వే మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ. శివనాగ ప్రసాద్ మరియు ఇతర రైల్వే అధికారులు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి, జిల్లా గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ రాం ప్రసాద్, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ బ్రాంచ్ అధ్యక్షుడు బాలకోటి రెడ్డి, ఇతర రోటరీ క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం



**నాచారం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :**

ఉప్పల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి కృషితో మల్లాపూర్ డివిజన్ అభివృద్ధికోసం రూ. కోటి 74 లక్షలు మంజూరు చేయించారు. దీంతో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి డివిజన్ పరిధిలో అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు పాలాబిశేకం చేశారు. ఈ సందర్భంగా కప్పర సాయికుమార్ గౌడ్ మాట్లాడుతూ బీరప్ప గడ్డ నుంచి మల్లాపూర్ మానిక్ చంద్ వరకు రూ. 64 లక్షలతో బీటీ రోడ్డు, రూ. 35 లక్షలతో, వెంకటరమణ కాలనీలో సీసీ రోడ్డు పనులు, రూ 30 లక్షలతో, బ్రహ్మపురి కాలనీలో సీసీ రోడ్డు పనులు. రూ 45 లక్షలతో సింగం చెరువు తండా స్మశాన వాటికలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనీయర్ నాయకులు మహిళా నాయకులు కాలనీ వాసులు పాల్గొన్నారు.



నగరం లో జరిగిన హై లైఫ్ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## గంగపుత్రులకు తగిన న్యాయం చేయాలి : డాక్టర్ దేశబోయిన రఘు



రాష్ట్ర మత్స్యశాఖ అదరపు సంచాలకుడు మురళీకృష్ణను వినతి పత్రం అందజేస్తున్న దేశబోయిన రఘు తదితరులు

**సికింద్రాబాద్, ఏప్రిల్ 28 ప్రభాతవార్తః**

తెలంగాణ రాష్ట్రంలో గంగపుత్రులకు జరుగుతున్న అన్యాయాన్ని ఇప్పటికైనా జరుగకుండా ఆపాలని తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది డాక్టర్ దేశ బోయిన రఘు రాష్ట్ర మత్స్యశాఖ అదరపు సంచాలకుడు మురళీకృష్ణను కోరారు. గంగపుత్ర సమస్యల పట్ల, గంగపుత్రుల హక్కులను సాధించుకోడానికి ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ చేపల వేట గంగపుత్రు/ బెస్త/ గుండ్ల కులస్తుల జన్మహక్కని గంగపుత్రులు/ బెస్తలు/ గూండ్ల కులస్తులు మాత్రమే సాంప్రదాయం మత్స్యకారులని చేపల వేటపై హక్కు గంగపుత్రులకు మాత్రమే కల్పించాలని కోరారు. అన్య కులస్తులు మత్స్యకారులు కాదని, ముదిరాజ్ / ముత్తి రాసి/ తెనుగు కులస్తుల వృత్తి పూలు పండ్లు అమ్ముట మాత్రమేనని, వారు వృత్తి మత్స్యకారులు కాదని తెలిపారు. మత్స్యకార సొసైటీలో వారికి సభ్యత్వం కల్పించొద్దని కోరారు. గత తెలంగాణ ప్రభుత్వం 2016లో తీసుకొచ్చిన జిఓ నెంబర్ 6 శాస్త్రీయ పద్ధతిలో జరగలేదని, ఈ జీవో ప్రకారం ఒక ఎకరా విస్తీర్ణంలో ఒక సభ్యత్వం కరెక్ట్ కాదని, దానివల్ల మత్స్యకారులకు జీవితం దుర్లభంగా మారిందని, ఒక్క ఎకరంలోని ఆదాయం కనీసం బిపిఎల్ లెవెల్ కంటే కింద ఉందని, జీవో నెంబర్ 6 వచ్చినప్పటి నుండి గంగపుత్ర ముదిరాజుల మధ్యల గొడవలు అధికమైయ్యాయని, జీవో నెంబర్ 6 ని వెంటనే రద్దు చేయాలని కోరారు. పాత విధానాన్ని కొనసాగిస్తూ రెండున్నర హెక్టార్లకు ఒక సభ్యుడిగా నమోదు చేయాలని కోరారు. అనంతరామన్ కమిషన్ 1970 సమర్పించిన రిపోర్ట్‌లో సూచించిన విధంగా గంగపుత్ర/ బెస్త/ గుండ్ల కులవృత్తి చేపల వేటని, మరియు ముదిరాజ్/ తెనుగు/ ముత్రాశి కులస్తుల కులవృత్తి పూలు పండ్లు అమ్ముట అని స్పష్టంగా ఉందన్నారు. కానీ గత ప్రభుత్వాలు అనంతరం కమిషన్లో మార్పులు చేస్తూ ముదిరాజ్ కులస్తులను కూడా చేపల వేటలో సభ్యత్వం ఇవ్వాలని అమెండ్మెంట్ తీసుకోవడం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత గత ప్రభుత్వం జీవో నెంబర్ 4 ద్వారా 2022లో ముదిరాజులు తెలుగు ముత్తు రాసి ఒకటేనని ప్రకటించారు అలాంటి జీవోను గంగపుత్రులు అనుమతించరని దాన్ని కోర్టులో ఛాలెంజ్ చేసామని చెప్పారు. ఇందుకు సంబంధించిన కేసు పెండింగ్లో ఉంది కాబట్టి దాన్ని అమలు చేయవద్దని కోరారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత 2014 జీవో నెంబర్ 6 విడుదలైన తర్వాత గంగపుత్రులపై ముదిరాజుల దాడులు అధికమైనాయినీ విచక్షణారహితంగా గంగపుత్రులను కొట్టడమే కాకుండా మత్స్య సంపద దోపిడీ చేయడం, చెరువుల్లో విషాన్ని కలపడం, కరెంటు షాక్తో చేపలు చంపడం లాంటి అనేక సమస్యలను గంగపుత్రులు ఎదుర్కొంటున్నారన్నారు. అట్టి సమస్యలను అరికట్టడానికి సాంప్రదాయక మత్స్యకారులకు రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు అయినటువంటి ఎక్స్పర్ట్ కమిటీకి వినతిపత్రం అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గంగ పుత్ర సం ఘం గౌరవ అధ్యక్షులు కైరం కొండ యాదగిరి కార్యదర్శి వంగల సుధాకర్ గారు సహాయ కార్యదర్శి కంటే సతీష్ గారు ఎగ్జిక్యూటివ్ నెంబర్ కడప వీరయ్యలు పాల్గొన్నారు.

## బిసి బిల్లు ఊసే ఎత్తని కెసిఆర్ : గుజ్జ సత్యం



**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

తెలంగాణ జనాభాలో 50 శాతం ఉన్న బీసీల పట్ల బీఆర్ఎస్ వైఖరి ఏమిటని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రశ్నించారు. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ నిర్వహించిన సభలో గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ తన సుధీర్ఘ ప్రసంగంలో బీసీల ఊసే ఎత్తక పోవడం శోచనీయం అన్నారు. తెలంగాణ ఉద్యమం తరహాలో రాష్ట్రంలో బీసీ వాదం పెరిగిపోయిందని, బీసీల్లో వచ్చిన చైతన్యం చూసిన కాంగ్రెస్ సర్కార్ తప్పని పరిస్థితుల్లో బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు చేస్తూ అసెంబ్లీలో చట్టం చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ 18 నెలల పాలనలో ప్రతీ అంశం పై మాట్లాడిన కేసీఆర్ బీసీల ప్రస్తావన ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీ ప్రశ్నించిన కేసీఆర్ బీసీల హక్కులు, డిమాండ్ల పై ఎందుకు ప్రభుత్వాన్ని నిలదీయడం లేదని ప్రశ్నించారు. బీసీ బిల్లు అమలు పై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించాల్సి ఉండాల్సిందన్నారు. తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు కోసం న్యాయ నిపుణులతో చర్చించి బీసీ బిల్లు అమలు చేయడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నందున కేసీఆర్ తన వైఖరి స్పష్టం చేస్తే బీసీలు హర్షించే వారని తెలిపారు. బీసీ బిల్లును గవర్నర్ వద్దకు పంపకుండా కేంద్రానికి పంపి చేతులు దులుపుకున్న ప్రభుత్వం పై వివమర్శనాస్త్రాలు సంధిస్తే బీసీల్లో ఆత్మవిశ్వాసం మరింత పెరిగేదన్నారు. బీహార్, తమిళనాడు ప్రభుత్వాలు గతంలో అనుసరించిన విధాన ప్రక్రియను ఇక్కడ కూడా పాటించాలని ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాల్సిందన్నారు. తమిళనాడులో రిజర్వేషన్లు పెంచినప్పుడు బిల్లులు పాస్ చేయడానికి చట్టాలు చేసినప్పుడు మొదట జీవోలు జారీ చేసి ఉద్యోగాలు భర్తీ చేశారు. తర్వాత కొందరు కోర్టు కు పోయినప్పుడు సుప్రీంకోర్టు రిజర్వేషన్లను కొట్టివేస్తే అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చి సవరణ చేసేలా కేంద్రం పై ఒత్తిడి తేవాలని సూచిస్తే బీసీలు బీఆర్ఎస్‌ను ఆదరించేవారని, బీసీల ప్రస్తావన లేక పోవడంతో బీసీలు ఆగ్రహంగా ఉన్నట్లు గుజ్జ సత్యం తెలిపారు.

## దురాశపరుల సంస్కరణోద్యమమే దిబ్బదేశానికి అవతల నాటకం

### -విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి

**రవీంద్రభారతి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :**

సమాజంలో కార్మికులు, కూలీలు, దొంగలు, సృజనాత్మక కళాకారులు, దురాశపరుల వల్ల ఏదో ఒక విధంగా అణచివేయబడిన వారు సంస్కరణ కోసం చేసిన ఉద్యమ కథాంశమే దిబ్బదేశానికి అవతల నాటకం గొప్ప సందేశాన్ని అందిస్తుందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి. రమణాచారి మీడియాకు తెలిపారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసరంజని హైదరాబాద్ ప్రతీనెలా ఒక నాటక ప్రదర్శన కావిస్తూ అటు రంగస్థల రంగాన్ని, ఇటు కళాకారులు, సాంకేతికవర్గానికి ప్రోత్సాహంలో భాగంగా మంగళవారం 29 రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో థియేటర్ బ్రిడ్జి, హైదరాబాద్ వారి సమర్పణలో బాదల్‌సర్కార్ హాట్‌మాలా కే ఉస్‌పార్‌కు శివాల గోవిందరావు, వి. వికాస్ చైతన్యల తెలుగు అనువాదం, వికాస్ చైతన్య దర్శకత్వంలో రూపొందిన దిబ్బదేశానికి అవతల సందేశాత్మక నాటకం ప్రదర్శింపబడుతుందని; ప్రధాన పాత్రల్లో అనిల్, భార్గవ్, హేమంత్, ఇంద్ర, కిరణ్, పవన్, ప్రశాంత్, శేఖర్, శ్యామ్, శ్రీరామ్, సూర్యచంద్ర, సుశాంత్, సంజయ్ తదితరులు నటిస్తారని కె.వి. రమణాచారి వివరించారు. అధిక సంఖ్యలో ఔత్సాహిక ప్రేక్షకులు, నాటక రంగస్థల అభిమానులు విచ్చేసి నాటకాన్ని ఆసాంతం తిలకించి కళారంగాన్ని, కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

## మెట్టుగూడ శ్రీ ఉమా మహేశ్వర సహిత వేంకటేశ్వర స్వామి శతాబ్ది ఉత్సవాలకు ఆహ్వానం



ఆలయ శతాబ్ది ఉత్సవాలకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటి ప్రతినిధులు

**తార్నాక, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :**

మెట్టుగూడలోని శ్రీ ఉమా మహేశ్వర సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరు కావాలని కమిటీ వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొనడంతో పాటు, శ్రీ కాలభైరవ స్వామి ప్రణా ప్రతిష్ట, శ్రీ ఆంజనేయ స్వామి, నవగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమాలను ప్రారంభించేందుకు రావాలని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.



ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ గాయత్రి టవర్స్ వ్యాపారులు

## ఆటల్లో గెలుపు ఓటములు సహజం

### -రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**అత్తాపూర్ ఏప్రిల్28, ప్రభాతవార్త :**

క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడా స్ఫూర్తితో జర్నలిస్టులు క్రికెట్ ఆడాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. నేడు శివరాంపల్లిలోని విజయానంద్ గార్డెన్ లో జరిగే జర్నలిస్టుల క్రికెట్ మ్యాచ్ సందర్భంగా సోమవారం మైలార్దేవ్ పల్లి లోని ఎమ్మెల్యే నివాసంలో జెర్సీ ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తి కత్తి మీద సాము లాంటిదని అలాంటి వృత్తిలో నిత్యం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న జర్నలిస్టులు ఒకతాటిపై కొచ్చి క్రికెట్ ఆడడం సంతోషం అని ఆయన అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని అన్నారు. జర్నలిస్టుల కుటుంబ సభ్యులు కూడా ఈ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. జర్నలిస్టులు భవిష్యత్తులో ఏ కార్యక్రమాన్ని నిర్వహించిన నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ క్రికెట్ జర్నలిస్టు కమిటీ అధ్యక్షుడు పద్మారం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సూర్యకిరణ్, కోశాధికారి అగ్ని వెంకటేష్ మరియు టి వెంకటయ్య, లక్ష్మీణ్ బాల మురళీకృష్ణ, సుజీవన్ రెడ్డి, దస్తగిరి, తిరుమలేష్, ప్రశాంత్ రెడ్డి, మధు, నరసింహ, రాము, రవి, శివ చరణ్, మహేందర్, రామకృష్ణ, రాజేష్ గౌడ్, కోట సాయి పాల్గొన్నారు.

## సాలిడ్ వేస్ట్ రీసోర్స్ పార్కును పరిశీలించిన కమిషనర్ శరత్‌చంద్ర



కొత్వాల్‌గూడ డిఆర్‌సిసిలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పార్కును పరిశీలిస్తున్న బండ్లగూడ కార్పొరేషన్ కమీషనర్ శరత్‌చంద్ర.

**నార్సింగి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :**

కొత్వాల్‌గూడలోని డిఆర్‌సిసిలో ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రీసోర్స్ పార్కును బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమీషనర్ బి. శరత్‌చంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని ప్రజలంతా తడి, పొడి చెత్తను ఇళ్లలోనే వేరు చేసి ఆటోలలో వేయాలని సూచించారు. ఇలా వేరు చేసిన చెత్తను ఆటోలలో తీసుకెళ్లి రీసోర్స్ పార్కులో కంపోస్టు ఎరువును తయారు చేసి, మొక్కలకు వేయడం జరుగుతుందన్నారు. పొడి చెత్తను రీసైక్లింగ్ చేసి, రీ యూస్ చేయాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పరిశుభ్రతను పాటిస్తే 80. శాతం వరకు రోగాలకు దూరం అవుతామన్నారు. రసాయనాలతో పండించిన ధాన్యం కాకుండా, సేంద్రీయ ఎరువులతో పండించిన ధాన్యంను తీసుకోవాలన్నారు. తాజా ఆహార పదార్థాలు, సీజనల్ పళ్లు తీసుకుంటూ ప్రతి రోజు నడక, ఆసనాలు, యోగా, ప్రాణయామం చేస్తే సంపూర్ణ ఆరోగ్యంను పొందుతామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు నరేందర్, రాము సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు భూభారతిపై అవగాహన సదస్సు

**తలకొండపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగార్జున నేడు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు స్థానిక దేవకిగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో అవగాహన సదస్సు ఉంటుందని, ఈకార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరై భూములకు సంబంధించిన కొత్తచట్టం వివరాలు రైతులకు తెలియజేస్తారని, మండలంలోని రైతులందరూ హాజరై విజయ వంతం చేయాలని ఆయన కోరారు.

## మహిళాపోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ




మహిళాపోలీస్‌స్టేషన్ సిబ్బందితో సమావేశమైన జిల్లాఎస్పీ నారాయణరెడ్డి

**వికారాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్‌ను సోమవారం జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు పరిశీలించి, శుభ్రత, భద్రతాపరంగా తీసుకుంటున్న చర్యలు సమీక్షించారు. అనంతరం స్టేషన్‌లో ఉన్న రికార్డులు పరిశీలించి, నిర్వహణలో మెరుగుదల కోసం అవసరమైన సూచనలు అందించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు దారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారిసమస్యలు గమనించి, వేగవంతమైన పరిష్కారం అందించాలంటూ సంబంధిత అధికారుల ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మహిళల భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఉమెన్ పోలీస్‌స్టేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి బాధితులకు న్యాయం కల్పించడం పోలీస్‌శాఖ ప్రధానలక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ స్టేషన్‌సిబ్బందితో సమావేశమై, విధినిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనులగురించి వివరించారు. ప్రజలతో స్నేహంగా వ్యవహరించి, మహిళల సంబంధిత సమస్యలపట్ల ప్రత్యేకశ్రద్ధ తీసుకో వాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును సకాలంలో విచారించి, నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్స్పెక్టర్ శివచంద్ర, ఎస్ఐలు రాణి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలుకేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**-చైర్మన్ డి.చంద్రశేఖర్**

**కందుకూరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

కందుకూరు ప్రాథమిక వ్యవసాయ సమకార సంఘం లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని ప్రయోజనం పొందాలని పిఎసిఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ రైతులను కోరారు. వరికోతలు ప్రారంభమైన సందర్భంగా ధాన్యంవిక్రయాలు బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించి రైతులు మోసపోవద్దనే అలోచనతో ప్రభుత్వం పిఎసిఎస్ ద్వారా ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఎగ్రేడ్ రకం వడ్లకు రూ.2320కాగా, బిగ్రేడ్ వడ్లకు రూ.2300గా ప్రభుత్వం ధర నిర్ణయిం చడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవా లని అయితే వ్యవసాయాధికారుల సిఫార్సుమేరకు రైతుల వద్దనుండి నిబంధనలమేరకు కొనుగోలుచేయడం జరుగుతుందన్నారు. రైతుల ప్రయో జనాలుకాపాడుటలో పిఎసిఎస్ ముందుంటుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సన్నరకం వడ్లకు ప్రభుత్వం అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అనంద్, నర్సింహ్మా, పర్వతాలు, పాండురంగారెడ్డి, మేఘావత్ చంద్రు, ఎఓ లావణ్య, ఎఇఓ రాజు, సిఇఓ యాదగిరిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

**-ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**



ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని మధ్య దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం మద్దతుధరతో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలంలోని ముంబాపూర్, మన్‌సాన్‌పల్లి గ్రామాల్లో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాలను స్థానికనాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుసంక్షేమానికి ప్రభుత్వం కట్టు బడి ఉందని, అందులోభాగంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తూ రైతులను ఆదుకోవడం జరుగుతుందన్నారు. కొనుగోలుచేసిన ధాన్యం డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లో జమచేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ధారసింగ్ తోపాటు కాంగ్రెస్‌నాయకులు డిసిఎంఎస్ అధికారులు పాల్గొన్నారు.

## భూగర్భడ్రైనేజీతో వరద సమస్యకు పరిష్కారం



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మాజీ చైర్‌పర్సన్ పావనియాదవ్

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

భూగర్భడ్రైనేజీ నిర్మాణంతో కాలనీల్లో వరద నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముళ్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 15వ వార్డులో నిర్మిస్తున్న భూగర్భడ్రైనేజీ నిర్మాణపనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఇక్కడ గతంలో మురికి కాలువ ఉండటంతో వర్షం వచ్చినసమయంలో మురుగు నిండి రోడ్డుపైకి వచ్చి ఇళ్లకు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. స్థానిక మాజీ కౌన్సిలర్ విజ్ఞప్తి మేరకు గతంలో మున్సిపల్ నుంచి నిధులు కేటాయించి ఒక అడుగు భూగర్భడ్రైనేజీ ఏర్పాటుచేస్తున్నారని తెలిపారు. డ్రైనేజీ పనులు నాణ్యతతోచేయాలని ఆమె కాంట్రాక్టర్‌కుసూచించారు. నాయకులు మహ్మద్ అబ్దుల్‌ఖయ్యూమ్, గోదా గణేశ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

**అంబేద్కర్ నగర్‌లో పైపులైన్ పరిశీలన..**

ఘట్‌కేసర్ మున్సిపల్ 11వ వార్డులోని అంబేద్కర్‌నగర్‌లో మంచినీటి పైపులైన్ పగిలిపోవడంతో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనియాదవ్ వచ్చి పరిశీలించారు. నీటి పైపులైన్ ధ్వంసం కాగా స్థానిక మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్ పమాచారం ఇవ్వగా నీరు కలుషితం అయ్యే ఆస్కారం ఉండటంతో ఆమె అధికారులకు చెప్పి మరమ్మతులు చేయాలని వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్‌కు సూచించారు.

# గులాబీల సభ కాదది.. గులాముల సభ

**-కెసిఆర్ కుటుంబ ప్రతిష్ఠ పెంచుకునేందుకే బిఆర్ఎస్ రజతోత్సవం**
**-కెసిఆర్‌పై నిప్పులుచెరిగిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**-కెసిఆర్ మోసాలపై చిట్టా విడుదలచేసిన ఎమ్మెల్యే**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

గులాబీల సభ కాదది.. గులాముల సభ అని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ కెసిఆర్‌పై ధ్వజమెత్తారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సర్వ నాశనంచేసింది కెసిఆర్ అని, మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఉన్న ప్రాంతాన్ని అప్పులకుప్పగా మార్చి కుటుంబ ఆర్థిక ప్రయోజనాలకు పెద్దపీట వేసిన కెసిఆర్ కాంగ్రెస్ గురించి మాట్లాడే నైతికహక్కు లేదన్నారు. సభలో హరిశ్చంద్రుడిలా మాట్లాడిన కెసిఆర్ పదేళ్లపాలనలో దళిత ముఖ్యమంత్రి హామీ నుండి ఉద్యమకారులపై కేసుల ఎత్తివేత వరకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, మొత్తం 100హామీలకు సంబంధించిన చిట్టాను మీడియాకు విడుదలచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమఫలాలు చూసి కెసిఆర్‌కు కడుపు నొప్పి వచ్చిందని విమర్శించారు. కాళేశ్వరం కాస్తా కూలిపోయే దశకు చేరుకుందని, కోట్లాది రూపా యలు మింగిన పాపానికి చిప్పకూడు తినే రోజులు దగ్గరపడ్డాయని కెసిఆర్‌ను హెచ్చరించారు. అలీ బాబా 40దొంగల టీమ్‌ను పెట్టుకొని కెసిఆర్ రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరో పించారు. ధరణి పేరుతో రైతులను పచ్చి మోసం చేసిన తీరుపై రేవంత్‌రెడ్డి చెప్పినవిధంగానే ధరణి ని బంగాళాఖాతంలో కలిపి భూభారతి తీసుకు వచ్చారని గుర్తు చేశారు. కెసిఆర్ గులాబీ గులాములు వాస్తవాలు తెలుసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు. కెసిఆర్ ప్రసంగ సమయంలో తడబాటు పడ్డారని, ప్రసంగం నచ్చక సొంత పార్టీ కార్యకర్తలే అల్లరి చేస్తుంటే కెసిఆర్ సహనం కోల్పోయారని అన్నారు.

## గొప్ప దార్శనికుడు అంబేద్కర్

**-తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి**



అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

అంబేద్కర్ గొప్ప దార్శనికుడు అని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం సభ ను ఉద్దేశించి మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు దిశా నిర్దేశం చేసిన మహోన్నతుడు అని కొనియాడారు. ప్రతి ఒక్కరు అంబేద్కర్ ఆశయసాధనకు కృషిచేయాలని సూచించారు. ఈవిగ్రహావిష్కరణ కార్య క్రమంలో పలువురు ప్రముఖులు, రాజకీయనాయకులు, కవులు, రచయితలు, కళాకారులు, అంబేద్కర్ సంఘం నాయకులు, కందనెల్లి గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

**-షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.స్వాతిరెడ్డి**



సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డిని స్వాగతిస్తున్న న్యాయవాది కంచి రాజగోపాల్

**షాద్‌నగర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న పాత కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు సంపూర్ణంగా కృషి చేయాలని షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.స్వాతిరెడ్డి కోరారు. సోమవారం షాద్‌నగర్ కోర్టు ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ సివిల్ జడ్జి ఎస్.స్వాతిరెడ్డికి కంచి లీగల్ అసోసియేట్స్ తరపున సీనియర్ న్యాయవాది కంచి రాజగోపాల్ స్వాగతంపలికారు. అదేవిధంగా ఇక్కడ అడిషనల్ జూని యర్ సివిల్ జడ్జిగా పనిచేసిన ధీరజ్‌కుమార్ మహబూబాబాద్ జిల్లా తొర్రూరు కోర్టుకు బదిలీ అయిన సందర్భంగా ఆయనకు వీడ్కోలుపలికారు. ఈసంద ర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.స్వాతిరెడ్డి న్యాయవాదులతో మాట్లాడుతూ పాత కేసులను త్వరగా పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకరించాలని కోరారు. అదేవిధంగా సీనియర్ న్యాయవాది గుంతల శివయ్య మాట్లాడుతూ బార్ అసోసియేషన్ తరపున న్యాయవాదులు పూర్తిస్థాయిలో కేసుల సత్వర పరిష్కారానికి సహకరిస్తామని వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్‌రావు, సీనియర్ అడ్వకేట్ కొట్టె గంగా ధర్, న్యాయవాదులు లక్ష్మణ్, నరసింహ్మా, బాలకిశోర్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలు మహిళలకు పుట్టిల్లులాంటివి

**-గ్రాడ్యుయేషన్‌డే జరుపుకున్న పంజగూడ కేంద్రం సభ్యులు**

**కందుకూరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

అంగన్‌వాడీ కేంద్రాలు మహిళలకు పుట్టింటితో సమానమని ఇక్కడ గర్భిణు లకు వారికి కలిగే సంతానానికి అన్ని విధాలుగా ప్రయోజనం చేకూరుతుందని అకులమైలారం మాజీ సర్పంచ్ కళమ్మరాజు, మాజీ ఎంపిటిసి కరుణసురేష్‌లు పేర్కొన్నారు. పంజగూడ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన గ్రాడ్యుయేషన్‌డే సందర్భంగా వారుహాజరై మహిళలకు అంగన్‌వాడీ కేంద్రాలద్వారా అరోగ్య వంతమైన జీవితాన్ని చిన్నారులకు మంచి భవిష్యత్తును అందించే విధంగా ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పుష్పలత, వనజ, లక్ష్మిజ్యోతి తోపాటు మహిళలు, చిన్నారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## కార్యకర్తల కృషి ఫలితంగానే సభ విజయవంతం

**-మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**



వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను కలిసిన ఉప్పల వెంకటేష్

**తలకొండపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

భారతీయ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన భారీ బహిరంగసభ కార్యకర్తల కృషి ఫలితంగానే విజయవంతమైందని తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్నారు. బిఆర్ఎస్ ఏర్పడి 25సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా రజతోత్సవమహాసభకు పార్టీ అధినేత కెసిఆర్ పిలుపునివ్వడంతో లక్షలాదిమంది సభకుహాజరై కాంగ్రెస్‌పార్టీపై ఉన్న వ్యతిరేకతను చాటుకు న్నారని ఆయన అన్నారు. గ్రామాలలోని పార్టీ కార్యకర్తల కృషి, పట్టుదలతోనే రాష్ట్రంలోని బిఆర్ఎస్ కార్యకర్తలు అందరూ పాల్గొని సభను ఊహించిన దాని కంటే అత్యధికంగా పాల్గొని కెసిఆర్‌కు మరింత బలాన్నిచేకూర్చారని ఆయన అన్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈరజతోత్సవ మహాసభకు రాష్ట్రం లోని మారుమూల గ్రామాలు, తండాల నుంచి కార్యకర్తలు, ప్రజలు ఎండను సైతం లెక్కచేయకుండా తరలివెళ్లి పెద్ద ఎత్తున విజయవంతంచేసిన కార్య కర్తలకు రాష్ట్రప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. పార్టీ కార్యకర్తలతో తరలివెళ్లి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను కలవడంతో ఆయన అభినందించినట్లు ఈసందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు.

## భూభారతిపై అవగాహన సదస్సు

**-ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసనసభాపతి**



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**ధారూరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

రైతులందరు భూభారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలని అపుడే భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటుచేసిన భూ భారతి అవగాహన సదస్సులో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్‌జైన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభాపతి మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రతాభావానికి తావునీయకుండా జవాబుదారీ తనాన్ని పెంచేందుకు భూభారతి నూతన చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. కొత్తచట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు, సాదా బైనామాలు వంటి సేవలు సులభతరం అవుతుందని ఆయన చెప్పారు. భూసమస్యల శాశ్వత పరిష్కారానికి భూభారతి ఎంతగానో దోహదపడుతుందని జిల్లాకలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. అనంతరం ఉద్యానవన పంటలువేసే రైతులకు స్పీకర్ స్ప్రింకులర్లు అందజేశారు. జాతీయ ఉపాధిహామీ కింద 25 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్లు(మోమిన్ కలాన్, మోమిన్ కూర్దు, నాసన్పల్లి) గ్రామపంచాయతీ నిధులు 6లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు ను శాసన సభాపతి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరి, తహసీల్దార్ సాజిదాబేగం, ఎంపిడివో నర్సింలు, ఎంపిఓ షఫీఖాన్, మండలపార్టీ అధ్యక్షులు మన్సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ అశోక్, పిఎసిఎస్ చైర్మన్ సత్యనారాయణ సత్యనారాయణరెడ్డి, మాజీపిఎసిఎస్ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి రాములు, నాయకులు బాబాఖాన్, బుజ్జయ్యగౌడ్‌లు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా శిథిల భవనం...!



కూలడానికి సిద్ధంగా ఉన్న శిథిల భవనం

**దౌల్తాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో గ్రామపంచాయితీ సమీపంలో ఉన్నటువంటి మిన రల్ వాటర్‌ప్లాంట్ చెడిపోవడంతో గతకొన్ని సంవ త్సరాలుగా మూతపడింది. మినరల్ వాటర్‌ప్లాంట్ ఉన్న భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాద కరంగా మారడంతో ఆభవనంకూలి ఎప్పుడు ఎవరి పై పడుతుందో అని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. శిథిలావస్థకు చేరినటువంటి ఈ భవనం గ్రామ పంచాయతీ, హనుమాన్ టెంపుల్ సమీపంలో ఉండటం వలన చిన్నపిల్లలు అక్కడే ఆడుకోవడం గాని, గ్రామస్తులు ఉదయం సాయంత్రం వేళ అక్కడే సేద తీర్చుకోవడం గానీ చేస్తుంటారు. పూర్తిగా శిథిలావస్థకు చేరినటువంటి ఈ భవనాన్ని కూల్చాలని గ్రామసభల్లో గ్రామస్థులు ఎన్నిసార్లు తీర్మానం చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగితేనే ఈ భవనాన్ని కూల్చుతారా..? అంటూ గ్రామస్థులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన ఈభవనాన్ని కూల్చవల సిందిగా గ్రామప్రజలు కోరుతున్నారు.

## కెసిఆర్ చెప్పే కథలు ఎవరూ వినరు

**-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగ్రాతి బాల్‌రాజ్‌గౌడ్**

**షాద్‌నగర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ చెప్పే కథలు తెలంగాణ ప్రజలు ఎవరూ వినే మూడ్‌లోలేరని షాద్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగ్రాతి బాల్‌రాజ్‌గౌడ్ కౌంటర్ ఇచ్చారు. సోమవారం విడుదలచేసిన ప్రకట నలో బాలరాజ్‌గౌడ్ పేర్కొంటూ కెసిఆర్ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాకారంచేసినందుకు కాంగ్రెస్ విలన్‌లా కన బడడం కెసిఆర్‌కు సిగ్గుచేటన్నారు. ఆనాడు సోనియాకు సాష్టాంగ నమస్కారం పెట్టింది మరిచిపోయి కెసిఆర్ మాట్లాడుతున్నాడని విమర్శించారు. తెలంగాణ పాలిట విలన్ కాంగ్రెస్‌పార్టీ అన్న కెసిఆర్ మాటలను ఉపసంహరించుకోకపోతే మళ్లీ తగినమూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. మనసులో విషాన్ని నింపుకొని కెసిఆర్ కాంగ్రెస్‌పార్టీని దూషిస్తూ మాట్లాడారని మండిపడ్డారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కనీసం ప్రతిపక్ష హోదా కూడా దళితుడికి ఇవ్వలేదని మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్‌పార్టీ నిర్వహించిన సభ లకు రాకుండా ఆటో డ్రైవర్లను, ప్రైవేటు టాక్సీ డ్రైవర్లను, ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకోనివ్వకుండా చేశారని, కానీ తాము అలా చేయలేదని, తమ ప్రభుత్వం తలుచుకుంటే కెసిఆర్ సభ జరిగి ఉండేదికాదని అన్నారు.

## భూభారతితో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

**-ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి**



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

భూభారతితో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో సోమవారం భూభారతి చట్టంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సు కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డిలతో కలిసి పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ధరణితో రైతులందరు ఆగమాగం అయ్యా రని, భూభారతితో రైతులు ఊపిరి పీల్చుకున్నారని అన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా భూభారతిలో పరిష్కారం ఉందని తెలిపారు. అనంతరం 24 మంది లబ్ధిదారులకు రూ.24,02,784/- విలువగల కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల ు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత, తాండూరు సబ్‌కలెక్టర్, రెవి న్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటువ్యాధి నివారణటీకాలు



గేదెలకు గాలికుంటు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారిణి పద్మిని

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

సీజనల్ వ్యాధులు రాకుండా రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణటీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారిణి పద్మిని అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఘణాపూర్‌లో సోమవారం గాలికుంటు వ్యాధి నివారణటీకాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని సిబ్బందితో కలిసి పశువులకు టీకాలువేశారు. 10మంది రైతులకుచెందిన 179గేదె లకు, రెండు ఆవులకు ఎఫ్ఎండి వ్యాక్సిన్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 14 వరకు పశువులకు టీకాలు వేస్తామని తెలిపారు. గాలికుంటువ్యాధి సోకితే ప్రధానంగా పాడిపశువుల్లో పాల దిగుబడి తగ్గుతుందని రైతులు శ్రద్ధవహించి తప్పకుండా టీకాలు వేయించాలని ఆమె సూచించారు.

## నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న క్లినిక్ సీజ్

**-మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సి.ఉమాగౌరి**




క్లినిక్‌ను సీజ్‌చేసిన డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సి.ఉమాగౌరి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న శ్రీవరసిద్ధి వినాయక ఫస్ట్‌ఎయిడ్ సెంటర్(క్లినిక్)ను మేడ్చల్‌జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సి. ఉమాగౌరి తనిఖీచేసి సీజ్‌చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లాలోని మల్కాజ్‌గిరిలోని ఆ క్లినిక్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించినట్లు, నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌ను నడుపుతున్నారని, గుర్తించి దాన్ని సీజ్‌చేసినట్లు డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సి.ఉమాగౌరి తెలిపారు. నిబం ధనలు, రిజిస్ట్రేషన్లు అంటూ ఏవీ పాటించనందున చర్యలు తీసుకు న్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మల్కాజ్‌గిరి డివిజన్ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ డాక్టర్ శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం

**-పాల్గొన్న డిఆర్ఓ హరిప్రియ**



ప్రజావాణిలో డిఆర్ఓ హరిప్రియ దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

మేడ్చల్‌జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 68దరఖాస్తులు అందినట్లు, వెంటనే సంబంధిత అధికారులు వాటినిపరిశీలించి పరిష్కరించటానికి తగుచర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) హరిప్రియ సూచించారు. సోమవారం మేడ్చల్‌జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణికార్యక్రమం జరిగింది. ఈసందర్భం గ డిఆర్ఓ హరిప్రియ మాట్లాడుతూ వివిధ శాఖలలో ఉన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రజావాణిలో వచ్చిన వాటిని తక్షణమే దరఖాస్తులను పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు.